# నావెళ్ళిపోయింది



రంగయ్య తెల్లవారకముందే స్నానం చేసి ఉతికిన సిర్కావి పంచ కట్టుకుని, పంగనామాలు దిద్దుకుని రేవు పడవ దగ్గరకొచ్చేవాడు. తాతలు, తండ్రులు రంగయ్యకి తరతరాల ఆస్తిగా ఆ రేవు పడవ నిచ్చారు. రంగయ్య ఆ పడవనే నమ్ముకుని, ఆ పడవే లచ్మిగా, ఆ పడవే కుల దేవతగా భావించి కిష్ట ఈ వొడ్డునుంచి ఆ వొడ్డుకి జనాన్ని చేరేస్తూ జీవనం సాగిస్తున్నాడు.

రేవులో కొస్తూనే లంగరెత్తి పడవలో వేసి, పడవ తల్లికి మొక్కి, కిష్ట తల్లికి మొక్కి ఆ పైన నాలుగు దోసెళ్ళ నీళ్ళెత్తి పడవ మీద చిలకరించి, తలెత్తి పైకి చూస్తే తూర్పు కొండల వెనక బద్ధకంగా నిద్ర లేస్తున్న సూరీడుకి మొక్కి, పక్కకి తిరిగి అమరేశ్వ రాలయం శిఖరాన్ని చూస్తూ "శంభో" అని ఆత్మ ప్రదక్షిణం చేసేవాడు. రంగయ్య పెట్టేది పంగనామ మైనా చేసేది శివస్మరణే. ఆ పూజలూ దణ్ణాలూ అయ్యేదాకా జనం ఒడ్డునే కూర్చునేవారు. రంగయ్య "ముత్తయిదువులు ముందెక్కండమ్మా" అనగానే ఆడవాళ్ళు లేచివచ్చి పడవకి పసుపురాసి కుంకం పెట్టి కొబ్బరికాయ తెస్తే కొట్టి క్రిష్ణలో వొదిలేవారు. లేకపోతే పళ్ళూ తాంబూలం కృష్ణమ్మకి అర్పించుకుని కుడి కాలు ముందుపెట్టి పడవలో కొచ్చేవారు.




వాళ్ళవెంట చెప్పులు చేతబట్టుకుని మగవాళ్ళు ఎక్కే వారు. ఆ పైన పడవ సాగేది.

ఇవతలొడ్డునున్న అమరావతికి, కృష్ణ అవతలున్న వూళ్ళకి రంగయ్య రేవు పడవే వారధి. రంగయ్య పడవలో రకరకాల జనం ఎక్కేవారు. అల్లదుగో! ఆ పిల్ల బుల్లెమ్మ. కొత్తగా పెళ్ళయింది. పసుపుతాడు ఇంకా మాయలేదు. మెడనిండా గంధం. తలనిండా దవనం. కొత్త పట్టుచీర వొంటిన రెపరెప లాడు తుంటే, మెళ్ళో కొత్త బంగారు నగ గరగరలాడు తుంటే ఆ చివరగా కూర్చున్న మొగుణ్ణి ఒక్కసారి చూద్దామని తన వాలుకళ్ళు తిప్పిందో లేదో అబ్బో మధ్యన బోలెడంతమంది జనం! అంచేత కళ్ళు దించేసుకుని, కాలి మట్టెల్నే చూస్తూ కూర్చుంది. కాళ్ళకి మెరుస్తున్న గోరింటాకు గోళ్ళనే చూస్తూ కూర్చుంది. రంగయ్య గడవేస్తూ "ఏం బుల్లెమ్మా! మమ్మల్ని మరిచిపోబోకేవ్! పుట్టింటి పేరు నిలుపు" అన్నాడు. ఆ మాటకి బుల్లెమ్మ గువ్వపిట్టల్లే ముడుచుకుపోయింది.


పడవ సాగుతుంటే అంచుమీద గడవేస్తూ తిరుగుతూ రంగయ్య అందర్నీ పలకరిస్తున్నాడు. "సుబ్బయ్యగారూ కందులు బాగా గిట్టుబాటయి నాయా?" "గింజ బాగానే దిగింది కాని ధర లేదయ్యా" అని సుబ్బయ్యంటే "నీ సొమ్మేం పోయిందయ్యా నీ దంతా మారుబేరమేగా" అని చురకంటించి అటు గడేసుకుంటూ వెళ్ళేవాడు రంగయ్య.

అల్ల ఆ మూల రంగమ్మ మూణ్ణెల్ల పసిపాపణ్ణి వొళ్ళో పెట్టుకుని మురిపెంగా చూసుకుంటూ కూర్చుంది. రంగమ్మకి కాపరానికొచ్చిన పది సంవత్సరాలకు కాన్పొచ్చింది. ఇంతకాలం అత్తగారూ, ఆడబడుచులూ అనే మాటలు గుండె కోత పెట్టగా, తనతో పాటు కాపరానికొచ్చిన ఆడపిల్లలు ముగ్గురు నలుగురు పిల్లల్నెత్తుకుని తిరుగుతోంటే రంగమ్మకి దుఃఖం పొర్లేది. పొలిండ్లు పొంగేవి. ఇంత కాలానికి రంగమ్మ కడుపు పండింది. కళ్ళన్నీ కన్నవాడి మీద పెట్టుకు చూస్తూ "ఇందుకోసం బతికానయ్యా!" అన్నట్టు కరిగిపోతోంది రంగమ్మ. రంగయ్య గడేస్తూ అటొచ్చి "చెల్లెమ్మా! కొడుకు పేరేం బెట్టావ్?" అంటే "ఇంకెవరి పేరు దేవుడి పేరే కదన్నా" అని బదులు చెప్పింది. "పుట్టినోడు దేవుడే! అందుకే ఆలస్యంగా పుట్టాడు" అంటూ అవతల పక్కకెళ్ళి పోయాడు రంగయ్య.

ఇంకోపక్క మొగుడుమీద కోపమొచ్చి అలిగి పుట్టింటికి పోతున్నది సూరమ్మ. కళ్ళొత్తుకుంటూ, ముక్కు పిండుకుంటూ, తనలో తను గొణు క్కుంటూ "ఆడి జిమ్మడ" అంటూ మెటిక విరు స్తుంటే రంగయ్య దగ్గరకొచ్చి మెల్లిగా "ఓస్ సూరమ్మా! చల్లబడవే! కష్టాలు కాస్సేపే వుంటయ్యే! కాని కాపరం కలకాలం వుండేదే! ఎల్లెల్లు పుట్టింటి కెళ్లే! మీ యమ్మ నిన్ను సల్లబరిచి మంచి మాట చెప్పదా? నువ్వు తిరిగిరావా! సందేళ పడవకి నిన్ను మీ ఆయన కాడికి చేర్చనా?" అన్నాడు.

ఇలా పడవలోని జనం నవ్వులూ, కన్నీళ్ళూ పంచుకుంటూ, వాళ్ళకి ధైర్యం చెబుతూ, వాళ్ళ సంబరాలకి తనూ పొంగిపోతూ జనాన్ని అవతలి వొడ్డుకి చేరవేస్తూ వాళ్ళ జీవితాల్లో కలిసిపోయి బతికే వాడు రంగయ్య. వాళ్ళు తలా కానీ ఇస్తే పాయంత్రానికి అవన్నీ కూడగట్టుకుని తండ్రి చేసిన బాకీ కింద జమగా, వసూల్లో మూడొంతులు సుబ్బయ్యకి కట్టి, మిగతా దాంతో నూకలు కొనుక్కునేవాడు.

ఓ అర్థరాత్రి వేళ సుబ్బయ్య గుమాస్తా వచ్చి రంగయ్యని లేపి పడవెయ్యాలన్నాడు. ఏం కష్ట మొచ్చిందో అనుకుని అంత రాత్రివేళ రంగయ్య రేవులోకొస్తే సుబ్బయ్య అవతలొడ్డునున్నాడన్నారు. అవతలొడ్డుకి పడవ తీసికెళ్తే అక్కడ సుబ్బయ్య, కొందరు మనుషులు, బస్తాలు, ఏవో సరుకులు వున్నాయి. జనం సరుకు పడవలోకెత్తుతుంటే "ఇవేమిటి?" అన్నాడు రంగయ్య. జొన్నలన్నాడు సుబ్బయ్య. కాదని అనుమానంగా చూశాడు రంగయ్య. "నోరు మూసుకు పడవెయ్యరా! లేకపోతే పీక పిసికేస్తాం" అని అన్నారు జనం. బిక్కచచ్చిపోయి కిక్కురుమనకుండా సరుకు చేరేశాడు రంగయ్య.



పొద్దున మళ్ళీ రేవులోకి రంగయ్యొచ్చాడు. కాని దిగాలుగా వున్నాడు. ఇంతలో ఓ వార్త గుప్పుమంది. "సుబ్బయ్య ఇంట్లో దొంగ సరుకు పట్టుకున్నారు" అని చిలవలు పలవలుగా చెప్పుకుంటున్నారు. రంగయ్య కుమిలిపోతున్నాడు. అందులో "నా పాపమూ వుంది" అని చెప్పబోయి నోరు నొక్కుకున్నాడు.

నాలుగు రోజుల తర్వాత సుబ్బయ్య వూళ్ళోకొచ్చి ఈ దొంగ రవాణా సమాచారం రంగయ్య వల్లే తెలిసిందని అనుమానించి రంగయ్య తండ్రి బాకీ కింద రేవుపడవ జప్తు చేశాడు. రంగయ్య గొల్లు మన్నాడు. భోరు భోరున ఏడ్చాడు. "అయ్యా నా పడవ తల్లి లేకుండా నేనుండలేనయ్యా! కిష్టలో గడెయ్యకుండా నేను బ్రతకలేనయ్యా! డబ్బులన్నీ మీరే తీసుకోండయ్యా! నేను మీకు వూడిగం చేస్తా నయ్యా! నా పడవ నాకొదిలేయండయ్యా!" అని కాళ్ళా వేళ్ళా పడ్డాడు.

సుబ్బయ్య వినలేదు. కిరాయి మనిషి చేత లంగ రెత్తించి "పోనీరా పడవ" అని ఆజ్ఞాపించగా పడవ కిష్టలో సాగిపోతుంటే వొడ్డున రంగయ్య ఏడుస్తూ అన్నాడు "ఇంత కాలం అందర్నీ అవతలొడ్డుకి చేర్చాను. బగమంతుడు నన్నీ వొడ్డునే వొదిలేశాడా!" అంటూ కూలిపోయాడు. ●

**బెదిరింపు**

తనకు ఇవ్వవలసిన బాకీ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న పరమేశం ఎదురయ్యాడు విశ్వనాథానికి. విసుగెత్తిపోయి ఇలా అన్నాడు.

'మర్యాదగా నా అప్పు తీర్చేస్తావా? లేక నా అప్పు పూర్తిగా తీర్చేశావని నీవు బాకీ వున్న మిగతా వాళ్లకి చెప్పనా?'

— కె.వి.ఎం.ఆర్. (కాకినాడ)